క్లుప్తంగా

సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐగా రమేశ్



సీపీ శ్వేతకు మొక్క అందజేస్తున్న టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐగా రమేశ్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయన పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ శ్వేతను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అదేవిధంగా అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా రమేశ్‌ను పోలీస్ అధికారులు అభినందించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం



కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వంశీధర్‌రావు

చిన్నకోదూరు(సిద్దిపేట): యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కేఆర్‌ఆర్ ఫౌండేషన్ ముందుకు సాగుతుందని ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు అన్నారు. బుధవారం కేఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నకోదూరులో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్, సాయన్న, కాముని హరి, రమేశ్, శ్రీనివాస్, ప్రభాకర్, సురేందర్, ఎజాజ్, వెంకట్, రాజిరెడ్డి, ప్రభాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ప్రణాళిక



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంసద్ ఆదర్శ గ్రామ పంచాయతీ యోజన(ఎస్‌ఏజీవై) పథకంలో మండలంలోని నర్సింహులపల్లె గ్రామాన్ని ఎంపీ బండి సంజయ్‌కుమార్ దత్తత గ్రామంగా ఎంపిక చేసుకున్నట్లు ఎంపీడీఓ దమ్మని రాము తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ లింగాల నిర్మల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ డీపీఓ ఓబులేషు పాల్గొని అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో చేపట్టే పలు అభివృద్ధి పనులను గుర్తించారు. వివిధ శాఖల నిధులతో పనులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాము, ఎంపీఓ విష్ణు, ఎంపీటీసీ రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మునిగడప గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేషంగౌడ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, సర్పంచ్‌లు బాల్‌లక్ష్మి, రాములు, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఏక్బాల్, నాయకులు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని 16వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కౌన్సిలర్లు మెట్టయ్య, భాగ్యలక్ష్మితో కలిసి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిన నర్సింలు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈఎంఆర్‌ఐ సర్టిఫికెట్లు అందజేత

వర్గల్(గజ్వేల్): పరిసర గ్రామాల్లో ఏమైనా ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భంలో బాధితులకు ప్రాథమికంగా అత్యవసర సేవలు అందించడంలో శిక్షణ పొందిన పలువురికి బుధవారం గౌరారం పోలీసులు ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముదిరాజ్ మహాసభ యూత్ కన్వీనర్‌గా ఆంజనేయులు

దుబ్బాకరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని మల్లాయిపల్లికి చెందిన చుక్క ఆంజనేయులు ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ యూత్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని ముదిరాజ్ మహాసభ గౌరవ అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. బాధ్యతలు అప్పగించిన బండ ప్రకాశ్ ముదిరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు.

క్రీడారంగాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ముగిసిన సీఎం కప్ మండల స్థాయి పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు



దుబ్బాక: విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, ఎంపీపీ పుష్పలత

దుబ్బాక: క్రీడారంగాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలతకిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలో నిర్వహించిన సీఎం కప్ మండలస్థాయి పోటీల ముగింపు కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా వారు జిల్లాస్థాయిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో టోర్నీకి ఎంపికై న క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సలీంమియా, ఎంపీడీఓ భాస్కరశర్మ, కమిషనర్ గణేశ్‌రెడ్డి, ఎంఈఓ ప్రభుదాస్, పీఈటీలు తదితరులున్నారు. అదేవిధంగా దౌల్తాబాద్‌లో క్రీడాకారులకు ఎంపీపీ సంధ్య, ఎంపీడీఓ రాజేశ్‌కుమార్, తహసీల్దార్ సుజాత బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు.

గజ్వేల్‌రూరల్: ప్రజ్ఞాపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం మండల స్థాయి క్రీడల ముగింపు సందర్భంగా ఎంపీపీ దాసరి అమరావతి ఆధ్వర్యంలో ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ వివిధ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఎంపీపీ అమరావతి క్రీడాదుస్తులు(జెర్సీ)లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, తహసీల్దార్ బాల్‌రాజు, ఎంపీడీవో మచ్చేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, కౌన్సిలర్ అర్చన, బాలమణి, ఎంపీటీసీలు అశోక్, ఆనందం, నాయకులు స్వామి, రమేశ్, గోవర్ధన్, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సిద్దిపేటరూరల్: ఇర్కోడ్ ఆదర్శ పాఠశాల మైదానంలో నిర్వహించిన మండల స్థాయి ఖోఖో పోటీల్లో రాఘవాపూర్ యువకులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్టుకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. ఆటల్లో నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను జిల్లా పోటీలకు ఎంపిక చేశారు. క్రీడాకారులను ఎంపీడీఓ సమ్మిరెడ్డి, గ్రామస్తులు అభినందించారు.

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సర్పంచ్ కాంటారెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ భూపతి, వ్యవసాయ శాఖ అధికారిని రాధికలు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లింగాల నిర్మల సీఎం కప్ విజేతలకు బుధవారం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దమ్మని రాము, సూపరింటెండెంట్ అంజయ్య, ఎంపీఓ విష్ణు, ప్రకాశ్, పీఈటీలు కనకారెడ్డి, పుష్పలత, సతీశ్‌కుమార్, పద్మ, శౌరీలు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీఎం కప్ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బుధవారం మండల కార్యాలయంలో బహుమతులను ఎంపీపీ బాలేషంగౌడ్ అందించారు. అదేవిధంగా ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకు పొందిన గడ్డం అశ్రితకు శాలువాలు కప్పి సన్మానించారు. పోటీలకు స్థానిక క్రీడాకారులకు సమాచారం ఇవ్వలేదని ఎంపీపీని క్రీడాకారులు నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కవిత, ఉపసర్పంచ్ మల్లేశం, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఏక్బాల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): వర్గల్ నవోదయలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లను, 100 మీటర్లు, 200 మీటర్ల పరుగులో విజేతలను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ మేరీస్వర్ణకుమారి తెలిపారు. కాగా పోటీల నిర్వహణలో సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులకు రైతుబంధు కో–ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి టీషర్టులు అందజేశారు.



సిద్దిపేటరూరల్: ఖోఖో జట్టుతో అధికారులు, ఉపాధ్యాయులు



గజ్వేల్‌రూరల్: ప్రజ్ఞాపూర్‌లో విజేతలకు బహుమతులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రాష్ట్రంలోనే ఉత్తమ ఆస్పత్రిగా తీర్చిదిద్దుకుందాం

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: దుబ్బాక ఆస్పత్రిని రాష్ట్రంలోనే ఉత్తమ ఆస్పత్రిగా తీర్చిదిద్దుకుందామని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. బుధవారం దుబ్బాక 100 పడకల ఆస్పత్రి అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు సౌకర్యాల లేమిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలతో పాటు వైద్యులు, సిబ్బందిని వెంటనే నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. రోగుల పట్ల స్నేహపూరితంగా నడుచుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ దేవుని లలిత, కమిషనర్ గణేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పరామర్శ

కూడవెల్లి వాగులోని చెక్‌డ్యాంలో స్నానాలకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. కూడవెల్లి వాగులో మృతి చెందిన దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చేర్వాపూర్ పిట్టలవాడకు చెందిన మల్లేశం, విష్ణు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, నాయకులు సుభాష్‌రెడ్డి, ఎల్లారెడ్డి, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

ఏపీడీ రవీందర్



పెద్దకోదూరులో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ

చిన్నకోదూరు(సిద్దిపేట): కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఏపీడీ రవీందర్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని పెద్దకోదూరు, రామంచ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించారు. రైతులు తమ ఆధార్‌కార్డు, బ్యాంక్‌ఖాతా, సాగు ధ్రువీకరణ పత్రం, పట్టా పాస్‌బుక్ జిరాక్స్ తీసుకురావాలన్నారు. కొనుగోలు, రవాణాలో ఇబ్బందులు వస్తే వెంటనే తెలియజేయాలని సూచించారు. 13 ఐకేపీ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 84 లారీల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకొని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఏపీఎం మహిపాల్, సీసీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే నిర్వాసితులకు న్యాయం

దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): మల్లన్నసాగర్ అదనపు టీఎంసీ కాల్వ నిర్వాసితులను ఎంపీ, ఎమ్మెల్యే మోసం చేస్తున్నారని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. తొగుట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక ఉపఎన్నికలో సిద్దిపేట, గజ్వేల్ తరహాలో నష్టపరిహారం ఇప్పిస్తానన్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు నిర్వాసితులను నిలువునా ముంచాడన్నారు. నిర్వాసితుల పక్షాన పోరాడింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. అదనపు కాల్వ పరిహారం రూ.13లక్షలు ఇప్పించానని దుబ్బాక ఎమ్మెల్యే, ఎంపీలు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల పాత్రపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు స్వామి, నాయకులు నరేందర్‌రెడ్డి, ఉప్పలయ్య, నర్సింలు, రామస్వామి పాల్గొన్నారు.

వర్షాకాలం ఉత్తమ సాగుపై శిక్షణ



రైతుతో మాట్లాడుతున్న భారతీయ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త పద్మకుమారి

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల పరిధిలోని తోర్నాల పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ఇబ్రహీంపూర్‌లో వానాకాలం పంటల సాగులో చేపట్టాల్సిన ఉత్తమ సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ వరి పరిశోధన సంస్థ నుంచి డా.ఏ.పీ.పద్మకుమారి హాజరై మాట్లాడారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు చేపట్టాల్సిన యాజమాన్య చర్యలను వివరించారు. రైతులు శాస్త్రవేత్తలు, అధికారులు చూపిన విధంగా పంటల సాగు చేపట్టడంతో మంచి దిగుబడితో పాటు అధిక ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వ్యవసాయ పరిశోధన స్థానం, తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త డా.ఎస్. శ్రీదేవి మాట్లాడుతూ.. పరిశోధనా స్థానంలో వరి, కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వాటి వినియోగంపై తెలిపారు. అదేవిధంగా పంటలకు వచ్చే చీడపీడలు, వరి నారుమడిలో చేపట్టే యాజమాన్యం, డ్రోన్ వాడకం, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ వరి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డా.రాంగోపాల్ వర్మ, డా.పీ.స్పందన భట్, ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్, తోర్నాల జె.విజయ్, తోర్నాల శాస్త్రవేత్తలు సరిత, డా.సాయినాథ్, వ్యవసాయ అధికారి రమణి, వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున, రైతుబంధు సమితి కో–ఆర్డినేటర్ నగేశ్, సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపు



రైతులకు సబ్సిడీ విత్తనాలు అందజేస్తున్న సారయ్య, ఏఓ గీత

నంగునూరు(సిద్దిపేట): పచ్చిరొట్ట ఎరువులు సాగు చేస్తే భూమిని గుల్ల చేసి పోషకాలు అందిస్తుందని, దీంతో మంచి దిగుబడి వస్తుందని ఏఓ గీత, ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య అన్నారు. నంగునూరు రైతు వేదికలో బుధవారం సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. నంగునూరులోని ఆగ్రోస్ సేవా కేంద్రంలో 65 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ సునిత, నాగేందర్, వెంకట్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల పరిధిలోని బెక్కల్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన సఫాయి కార్మికురాలు ఎల్లమ్మ పాముకాటుతో మరణించగా, బుధవారం మృతురాలి కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నాగపూరి కిరణ్‌కుమార్ రూ.10వేల ఆర్థికసాయం అందించి, అండగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జితేందర్, రాజు, ఎల్లయ్య, చంద్రయ్య, ప్రభాకర్, కిష్టయ్య, వేణు, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయండి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లో గల చింతల చెరువు నుంచి అక్రమ మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయాలని గ్రామానికి చెందిన మజీద్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ విజయేందర్‌రెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. మూడు నెలలుగా నిరంతరంగా మట్టిని కొట్టడంతో చెరువు దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అక్రమానికి ఆపేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రతీ వార్డులో ట్రిపుల్ ఆర్ కేంద్రాలు

సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సంపత్

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని 43 వార్డుల్లో రీయూజ్, రెడ్యూజ్, రీసైకిల్(ట్రిపుల్ ఆర్) కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ సంపత్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ సమావేశ మందిరంలో బల్దియాకు చెందిన అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా ఈనెల 20 నుంచి అన్ని వార్డుల్లో కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈనెల 20 నుంచి జూన్ 6 వరకు 15రోజుల పాటు కేంద్రాలు ఉంటాయని, వాటి నిర్వహణ బాధ్యత వార్డు ఆర్పీ, ఆఫీసర్లు చూడాలని సూచించారు. వార్డులో ఉన్న ప్రజల ఇంట్లో ఉండే పాత సామగ్రి, బట్టలు, పుస్తకాలు, సీసాలు, కాగితాలు మొదలైన వాటిని బయట పడేయకుండా ఈ కేంద్రాలకు తరలిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఈ కేంద్రంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి రోజు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కేంద్రం పని చేస్తుందని పేర్కొన్నారు. కేంద్రానికి వచ్చే వారి వివరాలు, సామగ్రి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి రోజు సాయంత్రం స్వచ్ఛత పోర్టల్, మేరీ లైఫ్ పోర్టల్ అప్డేట్ చేయాలని సూచించారు. అదేవిధంగా జూన్ 5న పెద్ద ఎత్తున పట్టణంలో క్లీన్ నెస్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ప్రజలను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. అనంతరం పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో మురికి కాల్వల్లో పూడికతీత పనులను వేగవంతం చేయాలని సూచించారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకుండా చూడాలని సూచించారు. వర్షాలతో వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. అదేవిధంగా నీటిపన్ను, ఇంటి పన్నులుపై రెవెన్యూ విభాగంతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు మహేశ్, సతీశ్, రంజిత్, యాదగిరి పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

సిద్దిపేటజోన్: రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతూ జూన్ 5 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు అర్బన్ మండలం రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ రాజేశంకు సమ్మె నోటీసు ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈనెల 22న మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో చర్చలు జరగనున్నాయని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రవీందర్, ప్రతినిధులు శేఖర్, ప్రసాద్, రజిత, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి



మిరుదొడ్డిలో చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

మిరుదొడ్డి(దుబ్బాక): ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. వీవోఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చెవిలో పూలు పెట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. వీవోఏల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వీవోఏలకు రూ.26వేల కనీస వేతనం చెల్లించాలన్నారు. రూ.10లక్షల సాధారణ బీమా కల్పించాలన్నారు. అర్హులైన వీవోఏలను సీసీలుగా గుర్తించి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. మహిళా గ్రూపులకు రివలింగ్ ఫండ్ ఇచ్చి వడ్డీ రుణాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో వీవోఏలు యమున, మంగమ్మ, పద్మ, శ్యామల, సుమలత, లక్ష్మి, లావణ్య, స్వప్న, సిద్దిరాములు, భూపాల్, శోభ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలులో జాప్యం చేస్తే సహించం



దుబ్బాక: కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మి

దుబ్బాక: ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని, కొనుగోలులో జాప్యం చేస్తే సహించేది లేదని ఏఎంసీ చైర్‌పర్సన్ ఇప్ప లక్ష్మి అన్నారు. బుధవారం రాయపోల్ మండల పరిధిలోని మంతూర్, అనాజీపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోళ్లను వేగం చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, సర్పంచ్‌లు శోభ, కో–ఆప్షన్ సభ్యుడు పర్వేజ్ తదితరులున్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

నంగునూరు(సిద్దిపేట): కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సిద్దన్నపేట మార్కెట్ కమిటీ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. బుధవారం సిద్దన్నపేట మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం నిర్వహించి యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ.. ఇప్పటివరకు 1,035 మంది రైతుల నుంచి 41,748 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నాగేంద్రం, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, మల్లయ్య, కనకవ్వ, కార్యదర్శి వెంకటయ్య, సభ్యులు నరోత్తంరెడ్డి, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మల్లేశం, లక్ష్మారెడ్డి, రవి, కమలవ్వ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమమే ధ్యేయం

గజ్వేల్‌రూరల్: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని బంగ్లావెంకటాపూర్, శ్రీగిరిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎంపీపీ దాసరి అమరావతి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బంగ్లా వెంకటాపూర్ సర్పంచ్ బాపురెడ్డి, ఐకేపీ ఏపీఎం యాదగిరి పాల్గొన్నారు.

పారిశుధ్య నివారణపై దృష్టి సారించాలి

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు ప్రారంభం



కట్కూర్‌లో పారిశుధ్య కార్యక్రమంపై ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ లక్ష్మి తదితరులు



చేర్యాల(సిద్దిపేట): రోడ్లను శుభ్రం చేస్తున్న సర్పంచ్ తదితరులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దరిచేరవని ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ అన్నారు. మండలంలోని కట్కూర్ గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో చీపుర్లతో రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అన్నీ గ్రామాల్లో వారంరోజుల పాటు జరగనున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఓ ఉద్యమంలా కొనసాగించాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శంకరయ్య, సర్పంచ్ జిల్లెల అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ భూపతి సుదేష్ణ, పంచాయతీ కార్యదర్శి గుగులోతు మోహన్‌నాయక్, వార్డుసభ్యులు, పారిశుధ్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్‌లో శ్రమదానం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని రాంపూర్‌లో సర్పంచ్ తివారి దినేశ్ ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం గ్రామ వీధులతో పాటు రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా ఉంటేనే ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నాగమణి, కార్యదర్శి రాజమణి, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని లకుడారంలో ప్రత్యేకాధికారి వీరరాజు ఆధ్వర్యంలో బుధవారం సర్పంచ్ కందూరి కనకవ్వ, పారిశుధ్య కార్మికులు రోడ్లను శుభ్రం చేశారు. మురికి కాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, పంచాయతీ కార్యదర్శి, సఫాయి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.